క్లుప్తంగా

బాలమ్మ పాదాలు తాకిన సూర్యకిరణాలు


తామర వర్ణంలో దర్శనమిస్తున్న బాలా త్రిపుర సుందరి అమ్మవారు

గండేపల్లి: మెట్ట ప్రాంతంలో ప్రసిద్ధి గాంచిన తాళ్లూరు రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం సూర్యకిరణాలు బాలత్రిపుర సుందరి అమ్మవారి పాదాలను తాకాయి. పాదాల నుంచి సిరస్సు వరకు సూర్య కిరణాలు ప్రసరించడంతో అమ్మవారి రూపం తామరవర్ణంగా మారింది. ఇది ఆలయానికి వచ్చిన భక్తుల మనస్సును ఆకట్టుకుంది.

అభివృద్ధి పనులకు ఆమోదం

తుని: పట్టణంలో పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ సమావేశంలో ఆమోదం తెలిపారు. మంగళవారం తాత్కాలిక చైర్‌పర్సన్ కుచ్చర్లపాటి రూపాదేవి అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. అజెండాలో పొందుపరిచిన 9 అంశాలను సభ్యులు ఏకగ్రీవం ఆమోదం తెలిపారు. ఇందులో ప్రధానమైనవి వీధి దీపాలు, ఎల్ఈడీ లైట్స్ నిర్వహణకు 12 నెలపాటు మెటీరియల్ సరఫరా చేసేందుకు రూ.36 లక్షలు, ప్రధాన రోడ్లలో కాలవల్లో పూడిక తీసేందుకు రూ.34 లక్షలకు తీర్మానం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత కౌన్సిల్ సభ్యులపై ఉందని రూపాదేవి అన్నారు. కౌన్సిలర్లు, కమిషనర్ వెంకట్రావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఎరువులు వాడని ఆకుకూరలనే వినియోగిద్దాం


అంగన్‌వాడీ సిబ్బందికి ఆకు కూరలు అందజేస్తున్న ఎంపీపీ

గండేపల్లి: ఎరువులు వాడని ఆకు కూరలనే వినియోగిద్దామని ఎంపీపీ చలగళ్ల దొరబాబు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గల న్యూట్రి గార్డెన్లో పెంచిన ఆకు కూరలను అంగన్‌వాడీ కేంద్రాలలో మంగళవారం ఆయన చేతుల మీదుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడని కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలన్నారు. గండేపల్లిలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు, ఉపాధి వేతన దారులకు ఈ ఆకు కూరలను అందజేసిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాతి బుజ్జి, ఏఓ చంద్రరావు, ఈసీ రమేష్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులకు మందుల పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న చక్రవర్తి

కోటనందూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్ బాధితులకు మందుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారి డాక్టర్ చక్రవర్తి, లెప్రసీ, ఎయిడ్స్, టీబీ జిల్లా అధికారి డాక్టర్ రమేష్ చేతుల మీదుగా ఎయిడ్స్ రోగులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందులు తీసుకోడానికి దూర ప్రాంతాల నుంచి శంఖవరం వచ్చే ఎయిడ్స్ బాధితుల కోసం వారి సొంత ప్రాంతాల్లోనే మందులు అందజేసేలా త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంతో ఎయిడ్స్ పేషెంట్లకు ప్రయాణ ఖర్చులతో పాటు శ్రమ తగ్గుతుందన్నారు. అనంతరం సిబ్బందితో ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవిశంకర్, సీహెచ్ఓ మేరీ, హెచ్‌వీ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తమ్మయ్యబాబు తప్పేమీ లేదు

ఏలేశ్వరం: ఈనెల 8న ప్రత్తిపాడు సీహెచ్‌సీలో జరిగిన సంఘటనలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు తప్పేమీలేదని వైద్యురాలు శ్వేత తెలిపారు. లింగంపర్తి గ్రామంలో తమ్మయ్యబాబు ఇంటి వద్ద మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె వెల్లడించారు. తనపై తమ్మయ్యబాబు ఎటువంటి దౌర్జన్యానికి దిగలేదని, దుర్భాషలాడలేదన్నారు. కొంతమంది అత్యుత్సాహంతో చేశారన్నారు. తమ్మయ్యబాబుపై లేనిపోని ఆరోపణలు రావడంతో తాను వివరణ ఇస్తున్నానని తెలిపారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

పిఠాపురం: స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానముల పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేద పండితులు స్వామి వారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు.

దాతలు.. జోహార్లు..

- ప్రజల కోసం సదుపాయాలు
- ఆర్వో ప్లాంట్, సచివాలయానికి ప్రహరీ ఏర్పాటు
- వాకర్స్ సేద తీరేందుకు బెంచీలు
- ముందుకొచ్చి రూ.లక్షలు వెచ్చిస్తున్న సాయం
- ఆనందం వ్యక్తం చేస్తున్న స్థానికులు


తుని బాడవ తోట పార్కులో దాత సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్

తుని: ప్రతి పని ప్రభుత్వం చేయడం కష్టమవుతుంది. ప్రజల కోసం పరితపించే దాతలు భారీ విరాళాలు ఇచ్చి ఉదారతను చాటుకుంటున్నారు. ప్రజలకు మినరల్ వాటర్ అందించాలన్న ఉద్దేశంతో ఒకరు రూ.లక్షలు వెచ్చించి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. మరొకరు మున్సిపల్ సచివాలయం, ఐసీడీఎస్ కార్యాలయానికి రక్షణ గోడ నిర్మించారు. మార్నింగ్ వాకింగ్ చేస్తున్న వాకర్లు సేద తీరేందుకు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఇలా సేవా కార్యక్రమాల వైపు దాతలు దృష్టి సారించడం శుభ పరిణామం. వీరిని స్ఫూర్తిగా తీసుకొని మరికొందరు ముందుకు వస్తున్నారు. కరోనాతో ఆర్థిక వ్యవస్థ కుదేలు కావడంతో ప్రజల అవసరాలను తీర్చలేక పురపాలక సంఘం పడుతున్న ఇబ్బందులకు దాతలు పరిష్కారం చూపుతున్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్

స్థానిక బాడవ తోట మున్సిపల్ పార్కులో దాత పెనుగొండ తిరుపతయ్య తన సతీమణి కృష్ణకుమారి జ్ఞాపకార్థం రూ.4 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా బాలాజీ రోడ్డు, పాత బజారు వీధి, బెల్లపు వీధి తదితర ప్రాంతాలకు చెందిన 200 కుటుంబాలకు శుద్ధి చేసిన మంచినీటిని సరఫరా చేస్తున్నారు. కేవలం నిర్వహణ కోసం 20 లీటర్ల టిన్నుకు రూ.5లు వసూలు చేస్తున్నారు. తక్కువ ధరకు మంచినీరు అందించడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తరచూ మరమ్మతులకు రావడంతో మున్సిపాలిటీ సొంత నిధులను వెచ్చించి వినియోగం ఉంచుతున్నారు. తొండంగి మండలం పి.అగ్రహారంలోను తిరుపతయ్య రూ.4 లక్షలతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు.

మున్సిపల్ పార్కులో బెంచీలు

గణపతినగర్ మున్సిపల్ పార్కులో ఉదయం, సాయంత్రం సమయాల్లో వందల మంది వాకింగ్ చేస్తున్నారు. పురపాలక సంఘం సదుపాయాలు కల్పించలేదు. వాకింగ్ చేసిన తర్వాత సేద తీరేందుకు వాకర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇది గమనించిన పలువురు దాతలు సొంతంగా నిధులు సమకూర్చి 20 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. దీంతో వాకర్లు కొంత సేపు విశ్రాంతి తీసుకోవడానికి అవకాశం కలిగింది. పార్కు లోపల వ్యాయామం చేయడానికి ఇనుప బార్లు, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును ఏర్పాటు చేశారు.


మున్సిపల్ బాలభవన్ స్కూల్‌కు నిర్మించిన ప్రహరీ

బాలభవన్‌కు ప్రహరీ

బ్యాంకుకాలనీ బాలభవన్ స్కూల్, సచివాలయాలకు టాయిలెట్లు, ప్రహరీ నిర్మాణానికి డెక్కన్ కెమికల్స్ లిమిటెడ్ రూ.20 లక్షల విరాళంగా అందజేశారు. ఈ నిధులతో చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు. నాలుగు టాయిలెట్లు నిర్మాణంలో ఉన్నాయి. దీంతో పాటు మున్సిపల్ ఉన్నత పాఠశాల, మహిళా జూనియర్ కళాశాలకు నిధులు సమకూర్చుతున్నామని డెక్కన్ కెమికల్స్ డైరెక్టర్ కె.వి.లక్ష్మీపతిరాజు సాక్షికి తెలిపారు.

ప్రజల ఆరోగ్యం కోసం



దేవుడు చలువతో మా కుటుంబం ఆనందంగా ఉన్నాం. నా సతీమణి కృష్ణకుమారి మమ్మల్ని విడిచి వెళ్లిపోయింది. సంపాదనలో కొంత భాగం ప్రజల ఉపయోగం కోసం ఖర్చు చేయాలని నిర్ణయిం తీసుకున్నాం. అందులో భాగంగా తుని బాడవ తోట పార్కు, తొండంగి మండలం పి.అగ్రహారం గ్రామంలో రెండు ఆర్వో ప్లాంట్లను రూ.8 లక్షలతో ఏర్పాటు చేశాం. అప్రాంత ప్రజలకు మినరల్ వాటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన సంతృప్తి పొందాం. భవిష్యత్‌లో మరి కొన్ని ప్రాంతాలకు సేవలను ఇస్తారిస్తాం.

–పెనుగొండ తిరుపతయ్య, దాత, తుని

విలేకరిపై దాడి అమానుషం


శంఖవరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

శంఖవరం: విధి నిర్వహణలో అన్యాయాన్ని ఖండిస్తూ, ప్రశ్నించిన విలేకరి దొరబాబుపై టీడీపీ నాయకుడు దాడి చేయడం అమానుషం అని శంఖవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కేలంగి హరినాథ్ ఖండించారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రెస్‌క్లబ్ సభ్యులు తహసీల్దార్ తాతారావుకు వినతిపత్రం అందజేశారు. శంఖవరం మండలం అన్నవరం గ్రామానికి చెందిన ఏపీ టూడే విలేకరిపై అన్నవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దాడిచేయడం దారుణమన్నారు. వెంటనే దాడి చేసిన బందారు సురేష్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొట్ల లోవరాజు,రేలంగి దొరబాబు,సకిరెడ్డి గోవింద్,పర్వత రామకృష్ణ, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు 43 మంది గైర్హాజరు

కిర్లంపూడి: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. కిర్లంపూడి ప్రభుత్వ, జగపతినగరం ప్రగతి జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఫస్టియర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 991 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా 948 మంది హాజరయ్యారు. 43 మంది గైర్హాజరైనట్టు సీఎస్‌లు పలివేల శివాజీ, జె.కాంచనమాల తెలిపారు.

బాధితులను ఆదుకోవడంలో కూటమి విఫలం


సింహాద్రిపురంలో బాధితుడిని పరామర్శిస్తున్న సూర్యచంద్ర

కిర్లంపూడి: అంగవైకల్యంతో శాశ్వతంగా మంచానికి పరిమితమైన వారికి నెలకు రూ.15వేలు ఇస్తానని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం దానిని అమలు చేయడంలో విఫలమైందని ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి, సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. సింహాద్రిపురానికి చెందిన పీతల వీరవెంకట సత్యనారాయణ విద్యుత్ స్తంభంపై నుంచి జారిపోవడంతో అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. ప్రజా సమస్యల పరిష్కార పర్యటనలో భాగంగా ఆదివారం సూర్యచంద్ర గ్రామంలో పర్యటిస్తు బాధితుడు పడుతున్న బాధను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన బాధితుడు వైద్యానికి, తినడానికి డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయమని బాధితుడు తన కుటుంబ సభ్యుల సహాయంతో స్థానిక అధికారుల నుంచి కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో మంచానికి పరిమితమైన బాధితులకు రూ.15వేలు ఇస్తానని చెప్పి 10 నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా బాధితుడికి రాలేదన్నారు. అధికారులు స్పందించి బాధితుడికి న్యాయం చెయ్యాలని లేకుంటే బాధితుడుతో కలిసి వచ్చే నెల 7వ తేదీ నుంచి కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్ద బాధితుడికి న్యాయం జరిగే వరకు శాంతియుతంగా నిరసనలు తెలియజేస్తామని సోమవారం పీజీఆర్ఎస్ గ్రీవెన్స్‌లో అర్జీపెట్టినట్టు తెలిపారు.

సీఆర్పీల సమస్యలు పరిష్కరించండి


ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రాంజీప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల శాసన మండలి సభ్యుడు పేరాబత్తుల రాజశేఖర్‌కు ఏపీసీఆర్పీడబ్ల్యూఏ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎలుపే రాంజీప్రసాద్ వినతి పత్రాన్ని అందజేశారు. మంగళవారం ఆయన కాకినాడలో సమగ్ర శిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాంజీ ప్రసాద్ మాట్లాడుతూ సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న సీఆర్పీల వేతనాలను పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పెంచాలని కోరారు. 14 ఏళ్లుగా సీఆర్పీలుగా సేవలు అందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగ భద్రతలేక, చాలీచాలని జీతాలతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆయన వాపోయారు.

సామర్లకోట రైల్వే స్టేషన్‌కు నేడు జీఎం రాక


సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో ఇన్‌గేట్, అవుట్ గేట్ ఆర్చి పనులు


రైల్వే స్టేషన్ ఆవరణలో చేస్తున్న అభివృద్ధి పనులు

అభివృద్ధి, సాంకేతిక పనుల పరిశీలన

సామర్లకోట: దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో రైల్వే స్టేషన్‌కు మంజూరు చేసిన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. జీఎం పర్యటనను పురస్కరించుకుని గత నెల రెండున దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన విషయం విదితమే. ఈ మేరకు బుకింగ్ కౌంటర్ హాల్‌ను పరిశీలించిన డీఆర్ఎం ఆ ప్రదేశం శుభ్రంగా ఉండే విధంగా రంగులు వేయాలని సూచించారు. దాంతో బుకింగ్ కౌంటర్ హాల్‌లో రంగులు వేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. బుకింగ్ హాల్ నుంచి ప్లాట్‌ఫారాలకు రాకపోకలు సాగించడానికి రెండు మార్గాలు ఏర్పాటు చేశారు. గతంలో ఒకే మార్గం ఉండేది.

కొనసాగుతున్న అభివృద్ధి పనులు

అదేవిధంగా ప్రయాణికులు వేచి ఉండటానికి 60 కుర్చీలను ఒకటో నంబరు ప్లాట్‌ఫారంపై ఏర్పాటు చేశారు. ప్లాట్‌ఫారంపై సీసీ కెమెరాలకు సంబంధించిన పనులు, ఆధునిక ఎలక్ట్రికల్ లైన్ పనులు, స్టేషన్‌లోకి ఇన్‌గేట్, అవుట్ గేట్ పనులు జరుగుతున్నాయి. నూతన సిగ్నల్ వ్యవస్థతో కూడిన కార్యాలయం, విశ్రాంతి భవనం, మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి. జీఎం రాకను దృష్టిలో ఉంచుకుని ప్లాట్‌ఫారాలతో పాటు, అన్ని కార్యాలయాలు, పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. రైల్వే స్టేషన్ ఆవరణ విశాలంగా కనిపించే విధంగా సుమారు వందేళ్ల వయస్సున్న చెట్లను సైతం తొలగించారు. ఆయా పనులను రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్(వర్క్స్) రవికాంత్, ఏడీఈఎన్ బి.శివప్రసాద్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.గిరి పర్యవేక్షిస్తున్నారు. రైల్వే జీఎం సాంకేతిక పనుల తనిఖీకి వస్తున్నారని, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి అవకాశం ఉండదని స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు.

వేంకటేశ్వరుని ఆలయంలో సప్తాహ పూజలు

సామర్లకోట: గొంచాల గ్రామంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ ఉత్సవాల్లో భాగంగా బుధవారం నుంచి ఈ నెల 16 వరకు ప్రతి రోజు సప్తాహ పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పితాని రామనరసింహమూర్తి, పద్మజ దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేస్తారన్నారు. అదేవిధంగా 13న ఆళ్ల శ్రీనివాసు, సాయిపల్లవీదేవి దంపతులు, 14న కుంచే గణేష్, స్వాతి దంపతులు, 15న పిన్నింటి శ్రీరామమూర్తి, సత్యవతి దంపతులు, 16న చింతల వీరసంతోష్, తరుణి దంపతులు పీటలపై కూర్చుని సప్తాహ పూజలు చేస్తారని వివరించారు. కల్యాణ ఉత్సవాల్లో భాగంగా 14న స్వామివారికి చక్రస్నానం, వసంతోత్సవం, రాత్రి స్వామివారికి శ్రీపుష్పయోగోత్సవం ఉంటాయన్నారు. 17న పూర్ణాహుతి, గోపూజ, అన్నదానంతో కల్యాణ ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ గోపి

ఏలేశ్వరం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి అన్నారు. పట్టణంలో మంగళవారం మహిళాసాధికారిత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు ఆర్థికస్వాలంబన ద్వారా అభివృద్ధి చెందాలన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధితో సమాజం పురోభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పెండ్ర శ్రీను, కోనాల వెంకటరమణ, ఎండగండి నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

యువతపోరును విజయవంతం చేయండి

కోటనందూరు: విద్యార్థులకు అండగా నిలుస్తూ వైఎస్సార్ సీపీ బుధవారం చేపట్టే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు పిలుపునిచ్చారు. మండలంలోని 17 పంచాయతీల పరిధిలో ఉన్న నాయకులు, కార్యకర్తలు టీజే నగరం చేరుకుని అక్కడ జరిగే పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొవాలన్నారు. అనంతరం టీజే నగరం నుంచి ర్యాలీగా కాకినాడ బయలుదేరి వెళ్లాలన్నారు. భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎంపీపీ విజ్ఞప్తి చేశారు.

గ్రామాల పరిశుభ్రతకు కృషి

కిర్లంపూడి: చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి గ్రామాల పరిశుభ్రతకు కార్యదర్శులు కృషి చేయాలని డీఎల్పీవో బాలామణి అన్నారు. బూరుగుపూడిలోని స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వాహణపై జగ్గంపేట, ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాల పంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందికి మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలామణి మాట్లాడుతూ గ్రామ సర్పంచ్‌లు సహకారంతో గ్రామాల అభివృద్ధికి, పరిశుభ్రతకు కృషి చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. సర్పంచ్ ఆశపు రామలక్ష్మి, ఆశపు భద్రి, ఈఓపీఆర్డీలు, డీపీఆర్వీలు తదితరులు ఉన్నారు.

అధ్యాపకులకు మార్గనిర్దేశం

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు అకడమిక్ ఆడిట్ నిర్వాహకులు మంగళవారం మార్గనిర్దేశం చేశారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాల పి.హరిరామ్ ప్రసాద్, తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎ.పుష్పలత తదితరులు అకడమిక్ అడ్వైజర్స్‌గా హాజరై కళాశాల ప్రత్యేకతలు, బోధనకు సంబంధించిన వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం..కల్యాణం

గండేపల్లి: తాళ్లూరు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక దివ్య కల్యాణం మంగళవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లను గరుడ, హంస, పొన్న, శేష, పల్లకీలపై మేళతాళాలతో గ్రామంలో ఊరేగించి తెల్లవారే సమయానికి ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం వైశాఖ పండితులు స్వామి అమ్మవార్లను కల్యాణ మండపంలో ఉంచి ప్రత్యేక పూజలు చేస కల్యాణం వేడుకగా చేశారు. ఈ కార్యక్రమంలో మెట్ట ప్రాంత భక్తులు, గ్రామస్తులు కళ్యాణ తంతును ఆద్యాంతం వీక్షించారు. భక్తులకు దర్శన ఏర్పాట్లు, ప్రసాద వితరణ కార్యక్రమాలను ఆలయ ఈఓ ఉండమట్ల రాజేష్ చేపట్టారు.


స్వామి, అమ్మవార్ల కల్యాణ తంతును జరుపుతున్న ఆలయ అర్చకులు

యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయండి


గోకవరంలో యువత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ఈ సందర్భంగా బుధవారం కాకినాడలో చేపట్టిన యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గోకవరం మండల వైఎస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన గోకవరంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు దాసరి చినబాబు ఇంటి వద్ద మంగళవారం యువత పోరుకు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో దాసరి చినబాబు, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకుడు సుంకర వీరబాబు, నియోజకవర్గ లీగల్ అడ్వైజర్ గుల్లా ఏడుకొండలు, కర్రి సూరారెడ్డి, ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు బిజ్జి రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ వైఫల్యం చెందిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చి అన్ని రంగాల కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాకినాడలో జరగబోయే యువత పోరులో అందరూ భాగస్వాములై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో తుమ్మల శివాజీ, బొడ్డపాటి వీరచంద్రం, టౌన్ కన్వీనర్ బాడితబోయిన చిన్న, తుపాకుల నాగేశ్వరరావు, నందూరి బుజ్జి, టౌన్ ఎస్సీసెల్ అధ్యక్షుడు మచ్చ మురళి, బూత్ కన్వీనర్ దంగేటి వెంకటరత్నం, గోలి చిన్ని, నిలయ్య తదితరులు పాల్గొన్నారు.

పారుపాకలో లేగదూడల ప్రదర్శన


లేగదూడల రైతులకు ప్రోత్సాహకాలను అందజేస్తున్న సర్పంచ్ పక్కుర్తి లక్ష్మి

రౌతులపూడి: పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో పారుపాకలో మంగళవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. పశువైద్యాధికారి ముద్రగడ వీరరాఘవరావు ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో 47 మంది డెయిరీ రైతులకు చెందిన కృత్రిమ గర్భధారణతో జన్మించిన ఆడదూడలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రైతులకు దూడల సంరక్షణ లింగ నిర్ధారణ చేసిన ఎదసూదుల గురించి అవగాహన కల్పించారు. రైతులందరికీ పలు పోషకాలతో కూడిన కిట్లను సర్పంచ్ పక్కుర్తి లక్ష్మి శంఖవరం ఏవీహెచ్ డా.పి మనోజ్‌కుమార్ డీఎల్‌డీఏ అధికారి కల్యాణి చేతుల మీదగా అందచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

కనుల పండువగా పుష్పోత్సవం


అమ్మవారి తెప్పోత్సవం


తాటిపర్తిలో అపర్ణాదేవి అమ్మవారు


ఊయల సేవ

పిఠాపురం: తాటిపర్తిలోని అపర్ణా సమేత నాగేశ్వరస్వామివారి కల్యాణోత్సవాలు మంగళవారంతో వైభవంగా ముగిశాయి. భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆకొండి ప్రభాకర శాస్త్రీల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్ల తెప్పోత్సవం ఘనంగా జరిగింది. నాగేశ్వర స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కల్యాణోత్సవాలు ముగింపు సందర్భంగా పుష్పోత్సవం, ఊయల సేవ కనుల పండువగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.